## గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలి

పెద్దకొత్తపల్లి, డిసెంబర్ 4: ఓడిపోయామని బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడవద్దు.. ఎన్నికల్లో గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేశ్‌రావు కోరారు. గ్రామాల్లో కార్యకర్తలు ఓటమి చెందామని అధైర్య పడవద్దని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ శ్రేణులు చేసే దాడులను ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. గత ఐదేండ్లపాలనలో ఏగ్రామంలో ఇలాంటి దాడులు పాల్పడలేదన్నారు. కాంగ్రెస్ శ్రేణులు గ్రామాల్లో దాడులు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థలో మచ్చలాంటిదన్నారు. శాంతియుతంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

వంగూరు, డిసెంబర్ 4: హైదరాబాద్–శ్రీశైలం ప్రధాన రహదారిపై వంగూరు గేటు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో వ్యక్తి గాయపడిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్సై కురుమూర్తి కథనం ప్రకారం.. మండలంలోని సర్వారెడ్డిపల్లి తండాకు చెందిన యువకుడు సబావట్ రాజశేఖర్(25) కల్వకుర్తి సమీపంలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. పని ముగించుకుని ఆదివారం రాత్రి 11గంటల సమీపంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా వంగూరు గేటు సమీపంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. వెనకాల వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న మరోవ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు రాజశేఖర్ అవివాహితుడు. ఈ ఘటనతో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కురుమూర్తి తెలిపారు.

## తుమ్మలపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

వంగూరు, డిసెంబర్ 4: ఎన్నికల్లో గెలిచిన ఆనందంలో కాంగ్రెస్ శ్రేణులు మండలంలోని తుమ్మలపల్లిలో ఆదివారం రాత్రి డీజేతో ఊరేగింపు తీశారు. ఈ క్రమంలోనే అక్కడే ఉన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ శ్రేణుల మధ్య చిన్నగొడవ పెద్దదైంది. కర్రలతో దాడి చేసుకోవడంతో ఇరువర్గాల సభ్యులకు గాయాలయ్యాయి. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్సై కురుమూర్తి తెలిపారు.


## రైతుల్లో తుఫాన్ ఆందోళన

పాన్‌గల్, డిసెంబర్ 4: మిచౌంగ్ తుఫాను కారణంగా వాతావరణం మేఘావృతమైన నేపథ్యంలో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇటీవల రైతులు వరి కోతలు చేసి ధాన్యాన్ని కల్లాలు, వరిధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరవేశారు. మరికొన్నిచోట్ల వరి కోతలు చివరిదశలో ఉన్నాయి. తుఫాను వల్ల వర్షాలు కురుస్తాయనే ఉద్దేశంతో రైతులు ముందస్తుగా ధాన్యం కల్లాలు, వరి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా కవర్లు కప్పి ఉంచారు.

## విద్యార్థులకు నోట్‌పుస్తకాలు పంపిణీ

పాన్‌గల్, డిసెంబర్ 4: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికి చెందిన ఇందిరమ్మ నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామానికి చెందిన రిటైర్డ్ టీచర్ రాఘవరెడ్డి ప్రథమ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని నాలుగు పాఠశాలలు దాదాపు 500 మంది విద్యార్థులకు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోలీస్ ప్రజావాణికి మూడు ఫిర్యాదులు



ఫిర్యాదు అందించిన మహిళ తో మాట్లాడుతున్న ఎస్పీ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4: ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మూడు ఫిర్యాదులు అందాయి. ఈమేరకు ఎస్పీ గైక్వాడ్ వైభవ్‌రఘునాథ్ ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ముగ్గురి నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. వారితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి సమస్యలున్నా బాధితులు నిర్భయంగా ఫిర్యాదులు చేయవచ్చని సూచించారు.

## పదో తరగతి పరీక్ష ఫీజు గడువు పెంపు

● డీఈవో గోవిందరాజులు

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4 : పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లింపు గడువును పెంచినట్లు డీఈవో గోవిందరాజులు సోమవారం సాయంత్రం ప్రకటనలో తెలిపారు. 2024 మార్చిలో నిర్వహించే పదో తరగతి రెగ్యులర్ పరీక్షకు, ఒకేషనల్ సర్టిఫికెట్ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు ఈనెల 7లోగా ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఫీజు చెల్లించొచ్చన్నారు. రూ.50 అపరాధ రుసుంతో 14వ తేదీ, రూ.200తో 21వ తేదీ, రూ.500తో వచ్చే సంవత్సరం జనవరి 3వ తేదీలోగా ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125 చెల్లించాలన్నారు. ఫెయిలైన విద్యార్థులైతే మూడు సబ్జెక్టుల వరకు రూ.110, ఎక్కువ ఉంటే రూ.125, ఒకేషనల్ విద్యార్థులు రెగ్యులర్ పరీక్షారుసుంతో పాటు అదనంగా రూ.60 చెల్లించాలని తెలిపారు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులు నిర్ణీత గడువులోనే అపరాధ రుసుం లేకుండా పరీక్షలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని హెచ్ఎం ఆయన సూచించారు.

## క్రీడల్లో మెళకువలు నేర్చుకోవాలి

నాగర్‌కర్నూల్, డిసెంబర్ 4 : క్రీడల పట్ల శిక్షణా శిబిరాల్లో క్రీడాకారులకు మంచి మెళకువలు నేర్పించాలని జిల్లా ఎస్‌పీసీ కోఆర్డినేటర్ ప్రసాద్‌గౌడ్ సూచించారు. సోమవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జూనియర్స్ బాల, బాలికల ఖోఖో జట్టు 42వ జూనియర్స్ రాష్ట్రస్థాయి ఆటలపోటీలో పాల్గొనేందుకు క్రీడాకారుల ఎంపికకు క్యాంప్‌ను జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ప్రసాద్‌గౌడ్, జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, మాజీ ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వెంకటయ్య హాజరై మాట్లాడారు. క్యాంప్ వల్ల క్రీడాకారులకు మంచి మెళకువలతోపాటు మంచి క్రమశిక్షణ, క్రీడాకారుల మధ్య సమన్వయంతో ఉండాలని తెలిపారు.

## విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

తాడూరు, డిసెంబర్ 4 : విద్యాబోధనలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని ఎంఈవో భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను సోమవారం ఎంఈవో భాస్కర్‌రెడ్డి పరిశీలించి మాట్లాడారు. విద్యాబోధనలో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యార్థులకు పాఠాలను ఉపాధ్యాయులు బోధించాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

# గెలిస్తే పొంగేదిలే.. ఓడితే కుంగిపోయేదిలే

● తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవనికుమార్‌మాదిగ



మాట్లాడుతున్న దేవనికుమార్ మాదిగ

కొల్లాపూర్, డిసెంబర్ 4: బీఆర్ఎస్ అభ్యర్థి బీరం హర్షవర్ధన్ రెడ్డి గెలిచితే పొంగేది లేదు.. ఓడితే కుంగిపోయేది లేదు. పార్టీలో ఉన్న కొందరి కుట్ర కారణంగానే బీరం ఓటమి చెందారని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవనికుమార్‌మాదిగ మండిపడ్డారు. సోమవారం ఆ సంఘం నాయకులతో కలిసి ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. మనసున్న మారాజు మంచితనానికి మారు పేరు బీరం అని, ఎవరొచ్చినా ఆప్యాయంగా పలకరిస్తూ వారి పనులు చేసిపెడుతూ ప్రజాభిమానం చూరగొన్న మంచి నాయకుడిని ప్రజలు గుర్తించకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. పల్లె సీమలాభివృద్ధిలో భాగంగా సీసీరోడ్లు, సైడ్రైన్లు, వైకుంఠధామాలు, ప్రకృతి వనాలు, మన ఊరు– మనబడి కార్యక్రమంలో స్కూళ్ల అభివృద్ధి, వాగులపై వంతెనలు, నిర్మాణాలు చేసి ప్రజారవాణ సౌకర్యం కల్పించిన ఘనత బీరానికే దక్కిందన్నారు. ఆయన ఓటమితో మరో ఐదేండ్లు అభివృద్ధి కుంటుపడనున్నదని అన్నారు. నాయకులు, కార్యకర్తలు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే, కుట్రతో కొందరు నాయకులు డబ్బులకు కక్కుర్తిపడి వెన్నుపోటుకు పాల్పడటం బాధాకరమన్నారు.

## కంఠమహేశ్వరస్వామి ఆలయానికి విరాళాలు

వెల్దండ, డిసెంబర్ 4: మండలంలోని కొట్ర గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం పలువురు దాతలు విరాళాలు అందజేశారు. కొట్రగ్రామ మాజీ సర్పంచ్ సింగిల్‌విండో డైరెక్టర్ పుణ్యమూర్తి జంగయ్య రూ.10వేలు, బాదేపల్లి రమేశ్‌గౌడ్ రూ.10వేలు, గట్టు కృష్ణయ్యగౌడ్ రూ.10వేలు, గట్టు మల్లయ్యగౌడ్ రూ.5వేలు విరాళాలను ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈసందర్భంగా వారిని ఆలయ నిర్వాహకులు అభినందించారు. అంతకముందు ఆలయ దర్వాజ ప్రతిష్ఠ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మేస్త్రి ఉపేందర్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, డిసెంబర్ 4 : మండలంలోని పాలెం, బిజినేపల్లిలో కార్తీకమాసం సందర్భంగా శివాలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో శివలింగానికి పంచామృతాభిషేకాలు, రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. కార్తీకమాసంతో నిత్యం భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. అదేవిధంగా సాయంత్రం శివాలయ ప్రాంగణాల్లో మహిళలు పెద్దఎత్తున దీపాలను వెలిగించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు చక్రపాణి, జయంతు, శుక్లాచార్య, శివ గణేశ్ భక్తులు ఉన్నారు.

## ముసురు వర్షం.. వరి పంటకు నష్టం

కల్వకుర్తి, డిసెంబర్ 4 : బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావంతో మండలంలో ముసురువర్షాలు కురుస్తున్నాయి. కోతకు వచ్చిన వరి ధాన్యానికి నష్టం వాటిల్లే ప్రమాదముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా మంది రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని కల్లాలో ఎండబెట్టారు. ముసురుతో ధాన్యం తడిసిపోయే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆరని ధాన్యాన్ని కల్లాల నుంచి నేరుగా మిల్లులకు తరలిస్తున్నారు. వడ్లు ఆరగా తేమ ఉండటంతో వ్యాపారులు ధర తక్కువగా చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కార్తీకమాసం వనభోజనాలు

అచ్చంపేటటౌన్, డిసెంబర్ 4: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఉసిరిచెట్టుకు పూజలు ఘనంగా నిర్వహించారు. సోమవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని అచ్చంపేట పట్టణంలోని భక్త మార్కండేయ ఆలయంలోని ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక దీపాలు వెలిగించి మహిళలు బతుకమ్మలు, కోలాటాలతో ఆడిపాడారు. అనంతరం చెట్టు ప్రాంగణంలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు కర్నాటి నిర్మల, శ్రావణి, సరిత, హైమావతి, నిర్మల, గీత, శకుంతల, కల్యాణి, కృష్ణవేణి, తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దు



చారకొండలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో వెంకటయ్య

చారకొండ, డిసెంబర్ 4: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని దళారులకు విక్రయించొద్దని, ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని సింగిల్ విండో సీఈవో వెంకటయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రాథమిక సహకార కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1010రకం వడ్లకు క్వింటాను రూ.2,203కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. దళారులను నమ్మి మోసపోవద్దని, రైతులు నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని చెప్పారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్‌విండో కార్యాలయ సిబ్బంది భీమయ్య, పర్వతాలు, రైతులు పాల్గొన్నారు.

## ‘అకాలవర్షాలపై అప్రమత్తంగా ఉండాలి’

లింగాల, డిసెంబర్ 4: ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సోమవారం మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి సేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలతో పాటు గంటకు 40–50కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశాలు ఉన్నాయన్నారు. ముఖ్యంగా జిల్లాకు వర్ష సూచన ఉన్నందున వరికోతలు పూర్తిగా నిలిపివేయాలన్నారు. ఇప్పటికే వరికొతలు పూర్తి చేసి ఉంటే పంట ఉత్పత్తులకు పాలిథిన్ కవర్లు లేదా ప్లాస్టిక్ కప్పి ఉంచాలన్నారు. అలాగే కూరగాయలు, ఆకు కూరల తోటల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు.

## ఓటమి విజయానికి నాంది కావాలి

● బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్

వీపనగండ్ల, డిసెంబర్ 4: కొల్లాపూర్ ప్రాంతాన్ని ఎమ్మెల్యేగా బీరం హర్షవర్ధన్ రెడ్డి అన్నివిధాలా అభివృద్ధి వైపు తీసుకెళ్లినప్పటికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందడం బాధాకరమని, ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కార్యకర్తలు అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు. ఓటమికి గల కారణాలను సమీక్షించుకొని భవిష్యత్‌లో పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకుసాగాలన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



సత్యం మృతదేహానికి నివాళులర్పిస్తున్న కుర్మయ్య

బిజినేపల్లి, డిసెంబర్ 4: మండల కేంద్రంలో ఏపీగ్రామీణ వికాస్ బ్యాంకు అటెండర్ సత్యం మృతి చెందగా, వారి కుటుంబానికి మాజీ మార్కెట్ చైర్మన్ కుర్మయ్య సోమవారం ఆర్థికసాయం అందజేశారు. వారి ఇంటికెళ్లి కుటుంబీకులను పరామర్శించి, పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు విజయ్, రాములు, నరేందర్‌గౌడ్, మల్లేశ్ ,శివ, గపూర్, శివ, మల్లేశ్ ఉన్నారు.

## మామిడిలో సస్యరక్షణ చర్యలు

కొల్లాపూర్ రూరల్, డిసెంబర్ 4: మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలను చేపట్టాలని ఉద్యానవన అధికారి లక్ష్మణ్ రైతులకు సూచించారు. సోమవారం కొల్లాపూర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆకుగూడు పురుగు, తేనెమంచు పురుగు ఉధృతి ఉందన్నారు. రైతులు ఉద్యానవన శాఖ అధికారుల సూచనల ప్రకారం ప్రొఫెనోఫాస్ 2 మి.లీ లేదా క్లోరోపైరిపాస్ 2 మి.లీ లేదా ఇమామేక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రా, అజాడిరక్టిన్ 1500పీపీఎం 5 మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి చెట్టంతా తడిచేలా పిచికారీ చేసుకోవాలని సూచించారు.